కనుల పండువగా సీతారాముల కల్యాణం


శాయంపేట : ప్రగతిసింగారంలో కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే ధర్మారెడ్డి


కమలాపూర్ : భీంపల్లిలో పాల్గొన్న పాడి కౌశిక్‌రెడ్డి


కమలాపూర్‌లో పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి సత్యేంద్ర


ధర్మసాగర్ మండలంలోని క్యాతంపల్లిలో..


ఎల్కతుర్తిలో సీతారాముల కల్యాణం


ఐనవోలు : విగ్రహాలతో మార్నేని దంపతులు


ఐనవోలులో తాళి చూపుతున్న పి.రవీందర్


వేలేరులో.. సీతారాముల కల్యాణం


దామెరలో..


ఆత్మకూరులో..


నడికూడలో..

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించగా పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి–జ్యోతి దంపతులు హాజరై స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడగా సర్పంచ్ పోతు సుమలత రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. శాయంపేటలోని శివ మార్కండేయ, శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీమత్స్యగిరి స్వామి ఆలయాల్లో అర్చకులు మార్త రాజ్‌కుమార్, రంగు యాదగిరి, అరుట్ల కృష్ణమాచార్యులు వేద మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణం నిర్వహించగా సర్పంచ్ కందగట్ల రవి దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.

ఐనవోలు : మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో, పున్నేలులోని విష్ణు అలయంలో, పంథినిలోని హనుమాన్, రామాలయాల్లో, పెరుమాండ్లగూడెంలోని హనుమాన్ ఆలయం ఎదుట, కక్కిరాలపల్లిలోని స్వయంభూ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో, రాంనగర్ రామాలయ ప్రాంగణంలో, నందనం మహాదేవాలయంలో, లింగమోరిగూడెం ఆంజనేయ ఆలయంలో, వెంకటాపూర్ రామాలయ నిర్మాణ స్థలంలో, గర్మిళ్లపెల్లి రాములోరి జంక్షన్‌లో, వనమాల కనపర్తి హనుమాన్ ఆలయం సమీపంలోని యాపచెట్టు కూడలి వద్ద, కొండపర్తి వేణుగోపాలస్వామి గుడిలో, ముల్కలగూడెం నాగమయ్య ఆలయ సమీపంలో, నర్సింహులగూడెం హనుమాన్ ఆలయంలో, సింగారం శివాలయంలో, ఒంటిమామిడిపల్లి హనుమాన్ ఆలయ సమీపంలో అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఐనవోలు శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయానికి రూ.లక్ష విలువగల సీతా, రామ, లక్ష్మణ, ఆంజనేయ పంచలోహ విగ్రహాలను డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు–ఎంపీపీ మధుమతి దంపతులు అందజేశారు. ఒంటిమామిడిపల్లి మాజీ సర్పంచ్ ఆడెపు దయాకర్ అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండలంలోని ఎల్కతుర్తి, సూరారం, కేశవాపూర్, దామెర, గోపాల్‌పూర్, వల్భాపూర్, పెంచికలపేట, భీమదేవరపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు స్వామి దంపతులకు పట్టువస్త్రాలు సమర్పించారు. పండితులు వేద మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు.

ధర్మసాగర్ : ధర్మసాగర్, వేలేరు మండలాల్లోని ఆలయాలలో సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. ఆయా గ్రామ పంచాయతీల పాలక మండలుల ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వేలేరు మండల కేంద్రంలోని వేములవాడ రాజరాజేశ్వర ఆలయం వారు దత్తత తీసుకున్న రుద్రరామేశ్వరాలయంలో నిర్వహించిన వేడుకల్లో సర్పంచ్ కాయిత మాధవరెడ్డి, ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, ఎంపీటీసీ ఇట్టబోయిన సంధ్య, పిన్నింటి తిరుపతిరెడ్డి పాల్గొనగా అర్చకులు సత్యనారాయణ శర్మ, పరమేశ్వర శర్మ కల్యాణం నిర్వహించారు. ధర్మసాగర్ మండలంలోని క్యాతంపల్లిలో సర్పంచ్ పిన్నపురెడ్డి అవనిజరెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించగా అర్చకులు కల్యాణం నిర్వహించారు. వేడుకల్లో విప్లవ్‌కుమార్‌రెడ్డి, పెరుమాండ్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలోని శ్రీ హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ పోలం కృపాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు గుమ్మడవెల్లి రామయ్య శర్మ, సుబ్బయ్య శర్మ, రాజు శర్మ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పట్టువస్త్రాలు, పుస్తెమట్టెలు సమర్పించారు. ఊరుగొండలోని ఆంజనేయస్వామి స్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణానికి సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి–స్వరూప దంపతులు పుస్తెమట్టెలు, పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ప్రధాన అర్చకులు తూపురాణి శ్రీనివాస్ శర్మ వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణం జరిగింది. ఓగ్లాపూర్‌లోని శివాలయ ప్రాంగణంలో నిర్వహించిన కల్యాణంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి–సునీత దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, బీఆర్‌ఎస్ నాయకులు కూనాటి సునీల్‌రెడ్డి, సుదర్శన్, సాంబయ్య, వేణు, సర్పంచ్ కేతిపల్లి సరోజన, ఎంపీటీసీ శ్రీలత రాధాకృష్ణ, ఉపసర్పంచ్ కుమారస్వామి, రెడ్డి సంఘం నాయకులు పలకల సాంబశివారెడ్డి, మన్నెం ఇంద్రారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు తుమ్మనపెల్లి సోనాజీ, జీవన్‌రావు, అకుల రవీందర్, తుమ్మనపెల్లి రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి వేదమంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణం నిర్వహించారు. గూడెప్పాడ్‌లోని శ్రీరామ మందిరంలో అర్చకులు ఆరుట్ల కేశవమూర్తి కల్యాణం జరిపించారు. తిరుమలగిరి, పెద్దాపూర్, లింగమడుగుపల్లె తదితర గ్రామాల్లో కల్యాణాలు, అన్నదానాలు జరిగాయి.

కమలాపూర్ : మండలంలోని కమలాపూర్‌లో కల్యాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి సత్యేంద్ర వేర్వేరుగా హాజరు కాగా అనంతరం భీంపల్లిలో కల్యాణానికి ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. ఉప్పల్, శనిగరం, శ్రీరాములపల్లి, అంబాల, నేరెళ్ల, దేశరాజుపల్లి, గూనిపర్తి గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. ఉప్పల్, శనిగరం, నేరెళ్ల గ్రామాల్లో కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు, కేడీసీసీబీ జిల్లా డైరెక్టర్ కృష్ణప్రసాద్, మాజీ సర్పంచ్ సమ్మయ్య, బీఆర్‌ఎస్ నాయకులు అశోక్, ప్రదీప్‌రెడ్డి, రమేష్, యోగా గురువు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. నెమరుగొమ్ముల రవీందర్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం



ధర్మసాగర్ : మండలంలోని మల్లక్‌పల్లి గ్రామంలో వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ కాలేరు కరంచంద్ సోదరులు వారి తల్లిదండ్రులు మణమ్మ–భద్రయ్య జ్ఞాపకార్థం నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిగెల రాజు, ఎంపీటీసీ బీంరెడ్డి కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏప్రిల్ 2న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ



శాయంపేట : పరకాలలోని ఆర్టీసీ డిపో దగ్గర ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. ఆ కార్యక్రమ కరపత్రాలను మండల కేంద్రంలో చేనేత సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆహ్వాన కమిటీ సభ్యులు మాట్లాడారు. విగ్రహావిష్కరణకు పద్మశాలీ కులస్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మామిడి శంకర్‌లింగం, నాయకులు వంగరి సాంబయ్య, దిండిగాల రజనీకాంత్, పోరండ్ల వేణు, సాయి, అలేటి శ్రీను, పల్నాటి రాంబాబు పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ని విజయవంతం చేయండి



ధర్మసాగర్ : ఏప్రిల్ 3న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ దుబ్బుల కొలుపు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జునుగరి దుర్గయ్య కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాకారులు సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉచిత బీమా సదుపాయం కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం ఏప్రిల్ 3న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ధర్నాకు మండలంలోని కళాకారులందరూ హాజరు కావా లని కోరారు. సమావేశంలో సంఘం కాగజ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు భామిని రాజ్‌కుమార్, మంచిర్యాల జిల్లా, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బామండ్లపెల్లి పోషం, సభ్యులు రాజు, డోకె ప్రవీణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు బోగిరి సారయ్య, సొతకారి ఎర్రయ్య, సదానందం పాల్గొన్నారు.

‘వర్గీకరణ’ చేయకుంటే బుద్ధి చెబుతాం

- ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్


మాట్లాడుతున్న గంగారపు శ్రీనివాస్

ధర్మసాగర్ : తక్షణమే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించకుంటే రానున్న ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీకి గుణపాఠం తప్పదని ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి గంగారపు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడచినా బీజేపీ పెద్దలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తొమ్మిదేళ్లుగా అనేక సాకులు చెబుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మాదిగ, ఉపకులాల పేదలు విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధిత, ఇతర రంగాల్లో నష్టపోతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి సరైన మెజార్టీ ఉన్నా వర్గీకరణ బిల్లుకు ఎందుకు చట్టబద్ధత కల్పించడం లేదని ప్రశ్నించారు. ఇకనైనా వెంటనే పార్లమెంటులో వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశాడు. లేనిపక్షంలో రానున్న అన్ని ఎన్నికల్లోనూ మాదిగ, ఉపకులాల ప్రజలు బీజేపీకి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈనెల 31న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు శాంతిసాగర్, సురుగూరి కమలాకర్, కొట్టె కళ్యాణ్, నీలం మహేందర్, చిలుక రాజు, మాచర్ల బాబు, ఖాజా, ఏనుట్ల రాజ్‌కుమార్, చిట్యాల పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

‘చెట్టుపల్లి శివాజీపై దాడిని ఖండిస్తున్నాం’

నయీంనగర్: ఆరె సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీపై గుర్తుతెలియని వ్యక్తులు మార్చి 28న దాడి చేయడాన్ని తెలంగాణ రైతు సంఘం ఖండిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సోమిడి శ్రీనివాస్, జెండా అంబయ్య మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తులను చట్టపరంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో సిరుల రవీందర్, జెండా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి


ఎగ్జిబిట్లను తిలకిస్తున్న హెచ్‌ఎం సబిత, శ్రీధర్

ఖిలా వరంగల్: విద్యార్థులు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని న్యూ కౌటిల్యాస్ స్కూల్ కరస్పాండెంట్ కోడం శ్రీధర్ సూచించారు. వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని న్యూ కౌటిల్యాస్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు కోడం సబిత ఆధ్వర్యంలో గురువారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై వైజ్ఞానిక, సైన్స్ ఫెయిర్ ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం, విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన పలు రకాల ఎగ్జిబిట్లను తిలకించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహా అన్నదానం

వరంగల్ చౌరస్తా: శ్రీరామ నవమిని పురస్కరించుకొని వరంగల్ 28వ డివిజన్ గిర్మాజీపేట రాధిక థియేటర్ సమీపంలో సినీ హీరో నాని అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మొగిలిచర్ల దినేష్, ప్రతినిధులు జితేందర్, శ్రీకాంత్, అభి పాల్గొన్నారు.

పేదలకు విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యత


మాట్లాడుతున్న సిద్ధార్థ

ఆత్మకూరు : పేదలకు విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఉచిత విద్య, వైద్యం సాధన సమితి జాతీయ అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ స్పష్టం చేశారు. గతేడాది నవంబర్ 5న మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లో ప్రారంభమైన చైతన్య యాత్ర మండల కేంద్రానికి గురువారం చేరుకుంది. ఈ సందర్భంగా సిద్ధార్థ ఆధ్వర్యంలోని బృందం ఎస్సీ, బీసీ హాస్టళ్లను సందర్శించి వసతులను పరిశీలించింది. అలాగే సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లను సందర్శించి సమస్యలపై అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని పలు హాస్టళ్లలో విద్యార్థులకు సరైన సదుపాయాలు లేవని ఆందోళన వెలిబుచ్చారు. పేదలు ఎక్కువగా హాస్టళ్లలో ఉండి చదువుకుంటారని చెప్పారు. ఈ క్రమంలో హాస్టళ్లలో సరైన వసతులు కల్పించడంతోపాటు ఉచితంగా విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీదే ఉందన్నారు. ఇప్పటికైనా అన్ని హాస్టళ్లలోనూ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాధన సమితి ఉత్తర తెలంగాణ ఇన్‌చార్జ్ నమిండ్ల కరుణాకర్ పాల్గొన్నారు.

నిర్మాణం పూర్తయ్యేది ఎప్పుడో..?

- నిలిచిపోయిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులు

శాయంపేట : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయ్యేది ఎప్పుడో..? అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్ రూ.25 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టగా పనులను జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి రెండేళ్ల క్రితం ప్రారంభించారు. కాగా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ బెడ్ లెవల్ వరకే పనులను పూర్తి చేసి పిల్లర్ల కోసం సలాకులు వేసి వదిలేశారు. అప్పటి నుంచి పనులు చేపట్టకపోవడంతో ఎస్సీ కాలనీవాసులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు

త్వరితగతిన నిర్మించాలి : మారపల్లి సుధాకర్, శాయంపేట

ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను త్వరితగతిన నిర్మించాలి. పనులు చేపట్టి రెండేళ్లు కావస్తున్నా పిల్లర్ల లెవల్‌కే పరిమితం చేయడం సరికాదు. భవన నిర్మాణం పూర్తయితే సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇకనైనా అధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌తో భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.


నిలిచిపోయిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు

డీసీసీకి అధ్యక్షుడు కావలెను..

వరంగల్ జిల్లా కాంగ్రెస్‌కు నాయకుడు లేక పార్టీలో స్తబ్ధత

- ముఖ్య నేతల మధ్య సఖ్యత లేక నియామకానికి ఆలస్యం
- ఉన్నతస్థాయిలో ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నం
- దేవేందర్‌రావుకే అవకాశాలంటున్న పార్టీ శ్రేణులు
- దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం



నమిండ్ల శ్రీనివాస్ ఎర్రబెల్లి స్వర్ణ

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీని ఏకతాటిపై నడిపించే నాయకుడు కరువయ్యాడు. నియోజకవర్గాల్లో నేతలు ఉన్నా.. జిల్లా కాంగ్రెస్‌కు రథసారథి లేకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పార్టీ కార్యక్రమాలు నిర్వహించే క్రమంలో స్తబ్దత నెలకొంది. దీంతో నాయకులు, కార్యకర్తలు కొంత ఇబ్బందిపడుతున్నట్లు తెలుస్తోంది. వరంగల్ తూర్పు, నర్సంపేట పూర్తి నియోజకవర్గాలతోపాటు వర్ధన్నపేట, పరకాల, పాలకుర్తి నియోజకవర్గాల్లోని ఐదు మండలాల్లో గల నేతలను ఒకేతాటిపై నడిపించే నాయకుడు హస్తం పార్టీలో కరువయ్యాడు. ఓవైపు వరంగల్ జిల్లాను ఆనుకొని ఉన్న హనుమకొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నీ తానై వ్యవహరిస్తుంటే.. వరంగల్ జిల్లాలో మాత్రం నైరాశ్యం నెలకొంది. ఫిబ్రవరి నెలలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించిన సమయంలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. అయితే అది నిలుపుకునే పరిస్థితి కనిపించడం లేదన్న వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో వినిపిస్తున్నాయి. కొద్ది నెలల క్రితం వరకు వరంగల్, హనుమకొండ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నాయిని రాజేందర్‌రెడ్డిని ఆ తర్వాత హనుమకొండ జిల్లా వరకు పరిమితం చేశారు. వరంగల్ జిల్లా అధ్యక్ష పదవి విషయంలో జిల్లాలోని ముఖ్య నేతల మధ్య భేదాభిప్రాయాలతో ఇంకా ఎవరినీ నియమించలేదన్న టాక్ ఉంది. ఏదేమైనా ముఖ్య నేతల మధ్య సఖ్యత కుదిర్చి డీసీసీ అధ్యక్షుడిని నియమిస్తే అన్ని నియోజకవర్గాల్లో శ్రేణులను ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంది.

నలుగురిలో ఆయనకే అవకాశం ఎక్కువ..

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్‌లు జిల్లా అధ్యక్ష పదవికి పోటీపడుతున్నారు. అయితే ఇద్దరూ హనుమకొండ జిల్లా ఓటర్లు కావడంతో అధ్యక్ష పదవి ఇచ్చేందుకు అధిష్టానం ఆలోచనలో పడింది. ముఖ్యుల నుంచి ఒత్తిళ్లు తీసుకొస్తున్నా వీరి విషయంలో కాస్త ఆచితూచి అడుగులు వేస్తోంది. దీంతోపాటు కొండా మురళి అనుచరుడైన నల్గొండ రమేశ్‌కు డీసీసీ పదవి ఇవ్వాలని ఆయన పట్టుబడుతున్నట్లు తెలిసింది. అలాగే 32 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ.. వివిధ హోదాల్లో పనిచేస్తున్న ప్రస్తుత కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్‌రావుకే అధ్యక్ష పగ్గాలిచ్చే అవకాశాలున్నాయని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. దొంతి మాధవరెడ్డి ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామానికి చెందిన దేవేందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగిస్తే బాగుంటుందన్న టాక్ ఉంది. ఏనుమాముల మాజీ డైరెక్టర్‌గా పనిచేసిన దేవేందర్‌రావుకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలనే అంశాన్ని కొందరు ముఖ్య నేతలు ఇప్పటికే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఇప్పటికే ఓ స్పష్టతకు వచ్చిన అధిష్టానం కొద్ది రోజుల్లోనే మిగిలిన ఆరు జిల్లాల అధ్యక్షులతో వరంగల్‌కు పేరు ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి.

నిరుద్యోగులకు న్యాయం చేయాలి


మాట్లాడుతున్న భరత్

దేశాయిపేట: టీఎస్‌పీఎస్సీ తప్పిదం వల్ల అన్యాయం జరిగిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని బీఎస్పీ వరంగల్ తూర్పు అధ్యక్షుడు జన్ను భరత్ డిమాండ్ చేశారు. దేశాయిపేటలోని సీకేఎం కళాశాల ఎదుట లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్కామ్ వెనుక ఉన్న పెద్దలను బయటకు తీసుకువచ్చేందుకు సీబీఐతో విచారణ జరిపించాలని సూచించారు. ఇలాంటి మోసం జరగకుండా ఇప్పుడున్న టీఎస్‌పీఎస్సీ కమిటీని తొలగించి కొత్త వారిని నియమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, శ్రీకాంత్, రాజేష్, లోకేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.